అనుదినం.. జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
08 పేజీలు | ఆదివారం 26 నవంబర్ 2023 | www.navatelangana.com



కేసీఆర్ ఇంటర్నేషనల్ కుట్రదారుడు

- అవినీతి మంత్రి వేములను ఇంటికి పంపుదాం
- కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ విజయశాంతి

8లో...



విద్యార్థినీలు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా అధికార సంస్థ చైర్మన్ సునీత కుంచాల

5లో...



త్వరలో దొరల ప్రభుత్వం పోయి..
ప్రజల ప్రభుత్వం రాబోతోంది

- తెలంగాణ ప్రజల హృదయాల్లో నాకు చోటుంది
- విజయభేరి సభలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ
- కాంగ్రెస్‌లో చేరిన మండవ వెంకటేశ్వర్‌రావు

నవతెలంగాణ-బోధన్


బోధన్‌లో ప్రసంగిస్తున్న రాహుల్‌గాంధీ

'ప్రజాస్వామ్య యుద్ధంలో దొరలకు ప్రజలకు మధ్య యుద్ధం మొదలైంది. త్వరలో దొరల ప్రభుత్వం అంతమై ప్రజల ప్రభుత్వం ఏర్పడబోతోందని' కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా శనివారం నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రజల కలలు ఏమాత్రం నెరవేర్చలేదని, దోపిడి పాలన కొనసాగిందని మండిపడ్డారు. తెలంగాణలోని నీటిపారుదల ప్రాజెక్టులలో లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని తాను స్వయంగా ప్రాజెక్టులను పరిశీలించినట్టు తెలిపారు. ఇది దొరల తెలంగాణలో చేసిన కుంభకోణం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల కోసం తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉంటుందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ తో నిరుపేదల భూములు మాయమయ్యాయని కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే ధరణిని రద్దు చేస్తామని అన్నారు. కెసిఆర్ మళ్లీ అధికారంలో వస్తే మన భూములు సైతం మాయం చేస్తాడని అన్నారు. కాంగ్రెస్ ఏం చేసిందని అంటున్న కేసీఆర్ ఆయన చదువుకున్న బడి, హైదరాబాద్ లో ఐటి, మెట్రో, ఎయిర్ పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్ అవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేసినట్టు గుర్తుచేశారు. ఆదాయం దండిగా ఉండే మంత్రిత్వ శాఖలు కెసిఆర్ కుటుంబ సభ్యుల చేతిలో ఉన్నాయని అన్నారు. దళిత బంధు పేరుతో లక్షల రూపాయలు అవినీతి జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్ళించారని అన్నారు. కోట్ల రూపాయల కుంభకోణం జరిగిన కేసీఆర్ ప్రభుత్వం ప్రజల సర్కార్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీ పథకాలతో తెలంగాణ ప్రజల ఆశలు నెరవేరుతాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే క్యాబినెట్ మీటింగ్‌లో ▸ మిగతా 2లో...

కేసీఆర్, మోడీకి ఆంతరంగిక సంబంధాలు

- కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ

వార్త మెయిన్ పేజీలో...




ప్రసంగిస్తున్న మోడీ

బీజేపీతోనే సౌభాగ్య తెలంగాణ

- బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు వారి పిల్లల భవిష్యత్తే ముఖ్యం
- బీజేపీకి తెలంగాణ యువత సంక్షేమమే లక్ష్యం
- ఆ రెండు పార్టీల నుంచి విముక్తి కోరుతున్నారు
- ప్రధాని మోడీ

నవతెలంగాణ-కామారెడ్డి

'బీజేపీ మాట ఇస్తే మాటపై నిలబడుతుంది. 370 ఆర్టికల్‌ను రద్దు చేస్తామని చెప్పి చేసి చూపించాం. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ బిఆర్ఎస్ నుండి విముక్తిని కోరుకుంటున్నారు. ప్రస్తుతం తెలంగాణలో బిజెపి హవా కొనసాగుతుంది. నేను తెలంగాణ వచ్చిన ప్రతిసారి తెలంగాణ ప్రజలు ఆశగా చూస్తున్నారని' ప్రధాని మోడీ అన్నారు. బిజెపి గెలిస్తే చెరుకు రైతులకు తీపిక ఉంటుందన్న మోడీ సకల సౌభాగ్య తెలంగాణను ఇవ్వడమే బిజెపి లక్షమని చెప్పారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో సకల జనుల విజయసంకల్ప సభకు ఆయన ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. నా కుటుంబ సభ్యులారా అని ప్రధాన మోడీ తన ప్రసంగానికి ముందు అనడంతో ప్రజల్లో నుండి అర్షధ్వనాలు వినిపించాయి.

వార్త మెయిన్ పేజీలో...

నాయకులను కొంటే ఓట్లు రాలవ్

- కొనుక్కోవడం రేవంత్‌రెడ్డికి అలవాటే
- కేసీఆర్ పక్కా లోకల్.. అసైన్డ్ భూములకు పట్టాలిస్తాం
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

8లో...

నవతెలంగాణ-భిక్కనూర్/కంఠేశ్వర్

నాయకులకు పైసలు ఆశ చూపి కొనుక్కోవడం రేవంత్‌రెడ్డికి అలవాటేనని, 50 లక్షల రూపాయలతో దొరికిన దొంగకు కామారెడ్డి ఓటర్లు ఓటు వేసే పరిస్థితి లేదని మంత్రి కేటీఆర్ అన్నారు.


నిజామాబాద్‌లో రోడ్‌షోలో పాల్గొన్న ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

- బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో విషాదం



వార్త మెయిన్ పేజీలో...

దళితబంధుకు ఎందుకు అనుమతి తీసుకోరు..?

- దళితులంటే కేసీఆర్‌కు చిన్నచూపు
- రాష్ట్ర పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-బిచ్కుంద


మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

దళితున్ని సీఎం చేస్తామని చెప్పిన కేసీఆర్ దళితులను మోసం చేశాడని, రైతుబంధుకు ఎన్నికల సంఘం అనుమతి తీసుకున్న కేసీఆర్ దళిత బంధు పథకం కొనసాగింపునకు అనుమతి ఎందుకు తీసుకోలేదని టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. గత పది సంవత్సరా లుగా రాష్ట్రంలోని దళితుల్ని మోసం చేస్తూ వస్తున్నా డని ఆగ్రహం వ్యక్తం చేశాడు. శనివారం బిచ్కుంద మండల కేంద్రంలో బహిరంగ సభలో ప్రసంగించారు.

వార్త మెయిన్ పేజీలో...

c m y k

కీచక ఉపాధ్యాయుడు సస్పెండ్

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఉపాధ్యాయుడు ఇబ్రహీం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుల్తానా ను సస్పెండ్ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి పింజ రాజా గంగారాం శనివారం తెలిపారు. విద్యార్థినిలతో అసభ్య ప్రవర్తన... శనివారం నవ తెలంగాణలో ప్రచురితమైన వార్తకు జిల్లా విద్యాశాఖ అధికారి విచారణ చేసి ఉపాధ్యాయుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరినీ సస్పెండ్ చేసినట్టు తెలిపారు.

రూరల్‌లో అన్యాయాన్ని సహించలేకే డాక్టర్ వృత్తి వదిలేశా

- ధరణి తెచ్చి భూములు గుంజుకున్నరు
- పోడు భూములకు పట్టాలిస్తాం..
- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ భూపతిరెడ్డి



మాట్లాడుతున్న భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్‌లో జరిగిన , జరుగుతున్న అన్యాయాన్ని సహించలేకే ప్రజలకు న్యాయంగా దక్కాల్సిన వాటికోసం ఇంకా మూడేళ్ల ఎమ్మెల్సీ పదవి త్యాగం చేసి, అనునిత్యం చేసే డాక్టర్ వృత్తిని, ఆసుపత్రి ని వదిలేసి ప్రజల ముందు వచ్చానని కాంగ్రెస్ రూరల్ అభ్యర్థి డాక్టర్ భూపతిరెడ్డి తెలిపారు. శనివారం ఇందల్ వాయి మండలంలోని చంద్రయాన్ పల్లి,రూప్లా నాయక్ తండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రభుత్వం దరణి పోర్టల్ తెచ్చి పేదలకు, నిరుపేదలకు అందజేసిన భూములను గుంజుకున్నరని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పోడు భూములకు పట్టాలిస్తామని, గిరిజనులకు 12%శాతం రిజర్వేషన్ లు కల్పిస్తామని,నిజామాబాద్ రూరల్ నీయోజకవర్గంతో పాటు, అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని వారి సంక్షేమానికి అబివృద్ధి కి ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ఈసారి జరిగే అసెంబ్లీ ఎన్నికలు బిఅర్ఎస్ ప్రభుత్వానికి చివరి ఎన్నికలని, బిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, గతంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలకు మాయ మాటలు చెప్పి లోబర్చుకునే ప్రయత్నం చేస్తున్నారని అలాంటి వారి మాటలను నమ్మవద్దని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగం ఇవ్వకుండా మోసం చేసిందని, కల్వకుంట్ల కుటుంబానికి ఉద్యోగలు పొందారని, వారికే అధిక లబ్ధి చేకూర్చాని, ఈ ఎన్నికల్లో సైతం ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకునే ప్రయత్నాలు బిఅర్ఎస్ నాయకులు చేస్తున్నారని, కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన అరు గ్యారంటీ కార్డుల పథకం పైన మొదటి సంతకం ఉంటుందని తెలిపారు.

రాష్ట్రానికి మంత్రినైనా వేల్పూర్‌కు బిడ్డనే

- నా కన్న ఊరు మద్దతే నాకు కొండంత బలం
- మంత్రి వేముల ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అన్నట్లు తాను రాష్ట్రానికి మంత్రినైనా వేల్పూర్‌కు బిడ్డనేనని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి, బిఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి వేల్పూర్ మండలంలోని ఉద్యమగడ్డ మోతే గ్రామంలో ఆయన స్వగ్రామం వేల్పూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌కు మోతే, వేల్పూర్ ఎంతో ఇష్టమైన గ్రామాలన్నారు. వేల్పూర్‌లో 150 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయన్నారు. మీ బిడ్డ ప్రశాంత్‌రెడ్డి ఎమ్మెల్యే కాకముందు వేల్పూర్ గ్రామం ఎలా ఉందో, ఇప్పుడు ఎలా ఉందో మీ కండ్లముందే ఉందన్నారు. వేల్పూర్ చుట్టూ వాగులపై పెద్ద పెద్ద బ్రిడ్జిలు, వాగుల నిండా చెక్ డ్యాంలు గ్రామంలో సెంట్రల్ లైటింగ్, గల్లీలో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు వేల్పూర్ నుంచి నలువైపులా వెళ్లే డబుల్ రోడ్లు, కొత్తగా కట్టుకున్న, అభివృద్ధి చేసుకున్న బడులు, గుడులు, మసీదులు, చర్చీలతో వేల్పూర్ గ్రామం సర్వతోముఖంగా అభివృద్ధి చెంది మీ కండ్లముందే నిలిచిందన్నారు. వేల్పూర్ గ్రామం మద్దతు తనకు కొండంత బలం అన్నారు.

మామ, అల్లుడు ఘర్షణ

తీవ్ర గాయాలతో ఇద్దరు మృతి

నవతెలంగాణ-బిచ్కుంద



మృతిచెందిన సైదబోయి, రాంబోయ్

భార్యను కాపురానికి పంపడం లేదంటూ మామ పై అల్లుడు దాడి మామ మృతితో కుటుంబ సభ్యులు అల్లుడు పై దాడి చేయడంతో అల్లుడు మృతి చెందిన సంఘటన బిచ్కుంద మండలంలోని గుండె నెమలి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై మురళి తెలిపిన వివరాల ప్రకారం గుండెనమ్లీ గ్రామానికి చెందిన రాంబోయి తన కూతురు అరుణను శాంతాపూర్ గ్రామానికి చెందిన సైదాబోయికి ఇచ్చి వివాహం జరిపించారు. తాగుడికి బానిసైన సైదా బోయి అరుణను కొట్టడం హింసించడం చేస్తుండటంతో గత రెండు సంవత్సరాలుగా అరుణ తల్లి గారింట్లోనే ఉంటున్నది. శుక్రవారం రాత్రి మద్యం సేవించిన సైదాబోయి గుండె నెమలిలోని మామగారింటికి వచ్చి భార్య అరుణను కొడుతుండగా తన కూతుర్ని ఎందుకు కొడుతున్నావని ప్రశ్నించిన మామ రాంబోయ్‌ను తన వెంట తెచ్చుకున్న కట్టెతో తలపై కొట్టగా అక్కడే పడిపోయాడు. ఇది గమనించిన రాంబోయ్ కొడుకు సాయిలు సైదాభోయిని కొట్టగా అక్కడే పడిపోయాడు. స్థానికులు తీవ్ర గాయాలైన అరుణను అంబులెన్స్ లో బాన్సువాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. గాయాలపాలైన మామ రాంబోయ్, అల్లుడి సైదాభోయి అప్పటికే మృతిచెందారు. బిచ్కుంద సిఐ కృష్ణ ఘటన స్థలానికి చేరుకొని జరిగిన సంఘటన పరిసరాలను పరిశీలించారు. రాంబోయ్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మురళి తెలిపారు.

కమీషన్ల ఎమ్మెల్యేను ఇంటికి పంపిద్దాం

- కాంగ్రెస్ ఎల్లారెడ్డి అభ్యర్థి మదన్మోహన్‌రావు

నవతెలంగాణ-రామారెడ్డి



మాట్లాడుతున్న మదన్‌మోహన్‌రావు

కమీషన్‌లు తీసుకునే ఎమ్మెల్యేను ఇంటికి పంపిద్దామని కాంగ్రెస్ ఎల్లారెడ్డి నియోజకవర్గ అభ్యర్థి మదన్ మోహన్ రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. రామారెడ్డి లో పుట్టి పెరిగి, విద్యను అభ్యసించానని, కాలభైరవ స్వామి వద్ద కుడుకలు తిని బతికానని, తనను ఒడిలో దాచుకున్న రామారెడ్డి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. పాఠశాల తో పాటు కాలభైరవ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని, తనకు వచ్చే జీతాన్ని ప్రతి నెల ఒక పేద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇస్తానని, పేద ప్రజల సేవల కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, రామారెడ్డిలో మూడవ తరగతి చదువుతున్న సమయంలో ఇల్లు కాలితే, రామారెడ్డి ప్రజలు హక్కున చేర్చుకొని నన్ను ఇంత పెద్ద వాన్ని చేసినందుకు రుణపడి ఉంటానని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, పలు సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జెడ్పి ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, వైస్ ఎంపీపీ రవీందర్రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహేందర్ రెడ్డి, ఎంపీటీసీ ప్రవీణ్ గౌడ్, లక్ష్మా గౌడ్, అంబాయి ప్రసాద్, లక్ష్మీరాజం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రభుత్వం రాబోతోంది

-మొదటిపేజీ తరువాయి

6 గ్యారంటీ స్కీముల అమలు చేయడంపై తొలి సంతకాలు చేస్తామని అన్నారు. తెలంగాణ ప్రజలతో మా కుటుంబానికి చిరకాల అనుబంధం ఉందని గుర్తు చేశారు. 1978 నుండి ఇందిరా గాంధీకి ఉమ్మడి రాష్ట్ర ప్రజల మద్దతు ఉందని దానిని మరువనని మాట ఇచ్చారు.

కేసీఆర్ ప్రభుత్వం ప్రజల సమస్యలు తీర్చలే : సుదర్శన్ రెడ్డి

కెసిఆర్ ప్రభుత్వం గత పది సంవత్సరాల కాలంలో ప్రజల సమస్యలను, వారి అవసరాలను ఏమాత్రం తీర్చలేదని కాంగ్రెస్ పార్టీ బోధన్ అభ్యర్థి పొద్దుటూరు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో లక్ష ఇరవై వేల కోట్లతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని మూడు కోట్ల ప్రజలకు రెండు లక్షల 20 కోట్లతో నేటి బడ్జెట్లో కేసీఆర్ ప్రభుత్వం ఏం చేసిందని నిలదీశారు. ప్రజల అవసరాలు, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇతర సమస్యలు ఏది తీర్చలేదని అన్నారు.

కాంగ్రెస్ లో చేరిన మండవ వెంకటేశ్వర్ రావు

మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు న్యాయవాది అజార్ కిషన్ రావు శనివారం బోధన్ పట్టణంలో జరిగిన కాంగ్రెస్ విజయభేరి మహాసభలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ సమక్షంలో వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కేసీఆర్ ప్రభుత్వం కొనసాగిస్తున్న అవినీతి కరమైన పాలనను సహించలేక కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మండవ వెంకటేశ్వరరావు తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, అవినీతి లంచగొండితనం విపరీతంగా పెరిగిపోయిం దని అన్నారు. నిరుపేదలకు ఇవ్వవలసిన రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి అమ్ముకుంటున్నారని, ప్రజలు మార్పు కోరుకోడానికి సిద్ధమయ్యారని అన్నారు. ఈ సభలో జమ్మూ కాశ్మీర్ పీసీసీ వైస్ ప్రెసిడెంట్ షా నవాజ్, జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అబిదా, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈచిత్రం అనీల్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భూపతిరెడ్డి, రాష్ట్ర నాయకులు తాహిర్, మున్సిపల్ చైర్మన్ పద్మ, పిసిసి సభ్యులు గంగాశంకర్, కౌన్సిలర్ శరత్ రెడ్డి, యూత్ నాయకులు నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీగా తరలివచ్చిన జనం..

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బోధన్ లో నిర్వహించిన కాంగ్రెస్ జయభేరి మహాసభకు కాంగ్రెస్ పార్టీ అధినేత, ఇందిరా గాంధీ మనుమడు రాహుల్ గాంధీ బోధన్ కు వచ్చేస్తుండడంతో బోధన్ నియోజకవర్గ నుంచి కాకుండా పలు ప్రాంతాల నుంచి ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆటోలలో భారీ సంఖ్యలో బోధన్‌కు తరలివచ్చారు. దాంతో రహదారులన్నీ వాహనాలతో రద్దీగా మారాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్రబలగాలతో, స్థానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ సర్పంచ్



కాంగ్రెస్‌లో చేరిన పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని కొత్త కోరుట్ల సర్పంచ్ రాములు నాయక్ తో పాటు పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీ వీడి నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇదే కాకుండా మండలంలోని పాలు గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు చేరారు. చేరిన వారందరికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం లో మాజీ ఐసిడిఎంఎస్ చైర్మన్ మునిపల్లి సాయరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి తో పాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండలం ఉమ్మడి యాచారం ఉత్నూర్ గ్రామాల నుండి బిఆర్‌యస్ నుండి కాంగ్రెస్ లోకి పలువురు చేరారు. సదాశివనగర్ మాజీ రైతుబంధు అధ్యక్షుడు శంకర్ నాయక్, సజ్జానాయక్ సర్పంచ్ నీలసురేందర్, సొసైటీ డైరెక్టర్ మోహన్ సింగ్, సీనియర్ నాయకుడు శ్రీనివాస్ గౌడ్ బిఆర్ఎస్ పార్టీని విడి ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని మదన్ మోహన్ కాండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా మదన్ మోహన్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కలసి కట్టుగా పనిచేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టాలని, స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ అవినీతి అక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని సూచించారు.

సీపీఐ(ఎం) గెలుపు కోసం ప్రచారం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఖమ్మం జిల్లా మధిర అసెంబ్లీ స్థానం నుంచి సీపీఐ(ఎం) తరఫున పోటీ చేస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌కు మద్దతుగా జిల్లా నాయకులు ప్రచారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు, కార్యదర్శివర్గ సభ్యులు నూర్జహాన్, శంకర్‌గౌడ్, సిఐటియు నాయకులు మోహన్ ప్రచారంలో పాల్గొన్నారు. కమ్యూనిస్టుల పట్ల ప్రజల ఆదరాభిమానాలు చాలా ఉన్నాయని పార్టీ నాయకుల పట్ల ప్రజల స్పందన అపూర్వకంగా ఉందని వారు తెలిపారు. అదేవిధంగా హుజూర్‌నగర్‌లో పోటీ చేసే పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మికి మద్దతుగా జిల్లా కమిటీ సభ్యురాలు సుజాత పాల్గొని ప్రచారం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పోటీ చేస్తున్న పగడాల యాదయ్యకు మద్దతుగా విద్యార్థి సంఘం నాయకులు మహేష్, విశాల్, జబ్బార్, నాగరాజు తదితరులు ప్రచారం చేపట్టారు. ఇక వరంగల్ జిల్లా జనగామలో పోటీ చేస్తున్న అభ్యర్థికి మద్దతుగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు విగ్నేష్ తదితరులు పాల్గొని ప్రచారం నిర్వహించారు.



ప్రచారంలో పాల్గొన్న సీపీఐ(ఎం) నాయకులు

అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

- బీఆర్ఎస్ అభ్యర్థి ఎ.జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-మాక్లూర్

నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో తనను గెలిపించాలని ఆర్మూర్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి కోరారు. శనివారం మండలంలోని మాణిక్‌బండారు, ఆర్టీసీ కాలనీ, మహాలక్ష్మి నగర్, బొర్గం (కే), కృష్ణనగర్, సింగంపల్లి, మెట్టు, మాదాపూర్ గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చేసిన అభివృద్ధి గురించి వివరించారు. మళ్ళీ గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రభాకర్, మాజీ మండల అధ్యక్షులు తిరుమల నర్సగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కార్పొరేటర్ రాయ్‌సింగ్, మేదిడ గంగాధర్, రాజేశ్వర్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

- నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాలో అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వ హించేందుకు హైదరాబాద్ సిటీ పోలీసు యాక్ట్ ప్రకారం నిషేధిత ఉత్తర్వులు జారీ చేశారని ఆయన తెలిపారు. కొన్ని రాజకీయ పార్టీలకు మద్దతుగా ఎన్నికల సమయంలో కొందరు మద్యం దుకాణాల యజమానులు టోకెన్ విధానంలో పెద్ద ఎత్తున మద్యం అమ్ముతున్నట్లు తమకు సమాచారం వచ్చిందని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఇలా పెద్ద మొత్తంలో విక్రయాలు జరుపకూడదని ఒకవేళ జరిపినట్లయితే చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామన్నారు. నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కాంతి హైస్కూల్లో విద్యార్థులకు అభినందన పత్రాలు అందజేత



పత్రాలు అందజేస్తున్న యాజమాన్యం

నవతెలంగాణ ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కాంతి హైస్కూల్‌లో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు వందల సంఖ్యలో పాల్గొని దీన్ని విజయవంతం చేశారు. ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు అభినందన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ కాంతి గంగారెడ్డి మాట్లాడుతూ పాతిక సంవత్సరాలుగా యాజమాన్యంతో సహకరిస్తున్న తల్లిదండ్రులు, విద్యార్థులు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మాలల మద్దతు కాంగ్రెస్‌కే

- మాల సంఘాల జేఏసీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మాలల మద్దతు కాంగ్రెస్‌కేనని మాల సంఘాల జేఏసీ అధ్యక్షులు అంగరి ప్రదీప్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ దళితుల అభివృద్ధి సంక్షేమం సాధికారత కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడమే గాక వాటిని చిత్తశుద్ధితో అమలు చేసిందని, అలాంటి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని మాల సంఘాల నిజామాబాద్ జేఏసీ అధ్యక్షులు ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అంగరి ప్రదీప్ పిలుపునిచ్చారు. శనివారం నిజామాబాద్ జిల్లాలోని ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ వర్కింగ్ చైర్మన్‌లు గోపు ప్రభాకర్, నాంది వినయ్, బత్తుల కిష్టయ్య, అబ్బి ప్రగతికుమార్, కిరణ్ అనుపాల్, హాకీ శ్రీనివాస్, రొడ్డ రాజేష్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత చేసి నిధులను పక్కదారి పట్టకుండా దళితుల అభివృద్ధి కోసం కృతనిశ్చయంతో పనిచేసిందని తెలిపారు. కార్యక్రమంలో వినోద్, రాజు, ప్రమోద్, రఘు, వెంకట్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్సీకి విన్నపం



ఎమ్మెల్సీ కవితతో కార్మిక సంఘం నాయకులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని శుక్రవారం రాత్రి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసి విన్నవించినట్లు కార్మిక సంఘ నాయకులు కుమారస్వామి, ఉపేందర్, రవిశంకర్ గౌడ్ తెలిపారు. 2015 డిసెంబర్ నుంచి కార్మికులకు రావలసిన బకాయి వేతనాలు చెల్లించాలని, అలాగే వివిధ కంపెనీలలో చెల్లించే గోల్డెన్ షేక్ హ్యాండ్ పథకం ద్వారా కార్మికులకు రూ.40లక్షలు ఇవ్వాలని, ప్రతి కార్మికుడికి ఒక ఎకరం భూమి ఇవ్వాలని, డబుల్ బెడ్ రూం ఇల్లు లేదా 200 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై ఎమ్మెల్సీ కవిత సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన విధానంపై ఆమె ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజాన్‌కు ఫోన్ ద్వారా సమాచారాన్ని అడిగి తెలుసుకొని మంత్రి కేటీఆర్ ద్వారా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం ప్రతినిధులు బాలకృష్ణ, దాస్, శ్రీనివాస్, శ్రీధర్‌లు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించిన వ్యయ పరిశీలకులు

నవతెలంగాణ-ఆర్మూర్

శాసనసభ నియోజకవర్గం పరిధిలోని ఆర్మూర్, పిప్రి తదితర ప్రాంతాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు శక్తి శనివారం సందర్శించారు. ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి స్థానికులను, అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సాధారణ పరిస్థితి నెలకొని ఉందని అధికారులు తెలిపారు. అయినప్పటికీ, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించాలని అబ్జర్వర్ శక్తి అధికారులకు సూచించారు.

శాంతియుత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని, ఎన్నికల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అబ్జర్వర్ వెంట జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి పాపయ్య తదితరులు ఉన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

పంట చెనులో, ఉపాధిహామీ ప్రదేశంలో ప్రచారం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని పలు గ్రామాల్లో తమ అభ్యర్థుల తరపున నాయకులు, కార్యకర్తలు వినూత్న రీతిలో ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. పని ప్రదేశాల్లో ఓటర్లను కలుస్తూ తమ పార్టీకి ఓట్లు వేయండి అంటూ అభ్యర్థిస్తున్నారు. శనివారం మండలంలోని అమీర్‌నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ గ్రామ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి, బాల్కొండ నియోజకవర్గం అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి తరఫున ప్రచారాన్ని నిర్వహించారు. పంట చెల్లల్లో కలుపు తీస్తున్న రైతులను, రైతు కూలీలను, ఉపాధి హామీ పని ప్రదేశంలో ఉపాధి హామీ కూలీలను కలిసి ప్రచారం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని ముఖ్యంగా రైతులకు 24 గంటల ఉచిత కరెంటు, రైతు పెట్టుబడి సాయం, రైతుభీమ, కొనుగోలు కేంద్రాల ఆవశ్యకతను సమూలంగా వివరిస్తూ, మళ్ళీ ఈసారి ప్రశాంత్ రెడ్డిని గెలిపించాలని కోరారు. గ్రామంలో మంత్రి ప్రచారం చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి వివరాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. కారు గుర్తుకు ఓటేసి ప్రశాంత్ రెడ్డిని మళ్ళీ గెలిపించి, అభివృద్ధిలో మీరు భాగస్వాములు కావాలని కోరారు.

నవతెలంగాణ

బీఆర్ఎస్‌ను నమ్మే స్థితిలో లేరు

• కాంగ్రెస్ పార్టీ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి షబ్బీర్ అలీ



ప్రచారంలో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని కాంగ్రెస్ పార్టీ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి షబ్బీర్ అలీ అన్నారు. శనివారం నిజామాబాద్ పట్టణంలోని ఆదర్శనగర్ హనుమాన్ టెంపుల్ వద్ద నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి మహమ్మద్ షబ్బీర్ అలీ పాదయాత్ర చేస్తూ ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, పది సంవత్సరాల నుండి ఏమి చేయనివాడు ఓటమి భయంతో ఇప్పుడు మీకు ఇది చేస్తా అది చేస్తా అని మాయమాటలు చెబితే ఎవరు నమ్మడానికి సిద్ధం లేరని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత, వారి కుటుంబం మొత్తం వచ్చి ప్రచారం చేసినా షబ్బీర్ అలీ గెలుపును అడ్డుకోలేరని వివరించారు. పట్టణంలో ఏ గల్లీకి వెళ్లినా ప్రజలందరూ సమస్యలతో సతమతమవుతు న్నారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేశామంటున్నారని, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు మాత్రమే అభివృద్ధి చెందారని విమర్శించారు. బీజేపీ అబద్ధాలు చెబుతూ ఉద్యోగాలు ఇస్తామని మాయమాటలు చెప్పి యువతను కులాల మతాల పేరిట రెచ్చగొట్టి వాళ్ళ భవిష్యత్తును నాశనం చేస్తుందన్నారు. యువతను రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ధిపొందడం కాదని, వారికి ఉపాధి ఉద్యోగ విద్య ఆరోగ్య సదుపాయాలు కల్పించాలన్నారు. కేంద్రంలో 10 సంవత్సరాల నుంచి అధికారంలో ఉండి ఏం అభివృద్ధి చేసారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులు అమ్ముకోవడం తప్ప వేరే మార్గం తెలియదని విమర్శించారు. ప్రజల సొమ్ము దోచుకోవడం.. తన మిత్రులైన ఆదానీ, అంబానీలకు పంచడంతో వాళ్లు బాగుపడ్డారు తప్ప దేశ ప్రజలు గాని తెలంగాణ ప్రజలు గాని బాగుపడలేదని తెలిపారు. కాంగ్రెస్ గెలిపిస్తే అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

24 గంటల బీఆర్ఎస్ కావాలా.. 3 గంటల కాంగ్రెస్ కావాలా..?

• బీఆర్ఎస్ రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



ప్రచారంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి

24 గంటల కరెంట్ ఇస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలా.. లేక 3 గంటలు కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ పార్టీ కావాలో రైతులు, ప్రజలు ఆలోచించుకోవాలని బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం డిచ్‌పల్లి మండలంలోని నక్కలగుట్ట తండా, గొల్లమట్ తండా, నడిమితండా, ఖిల్లా డిచ్‌పల్లి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజలనుద్దేశించి బాజిరెడ్డి మాట్లాడారు. మంచిప్ప ప్రాజెక్టును రూరల్ నియోజకవర్గానికి వరప్రధాయినిగా చేద్దామనుకుని పనులను ప్రారంభిస్తే కావలని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ప్రజలను ఆయె రామయానికి గురిచేసి పనులు జరగకుండా అడ్డుకున్నారని తెలిపారు. గతంలో పాలించిన పాలకులు గ్రామాలను అన్నివర్గాల ప్రజలను విస్మరించి పాలన చేశారని తెలంగాణ వచ్చిన తర్వాత ఏ గ్రామం చూసినా కోట్ల రూపాయల తో అభివృద్ధి చేపట్టినట్టు వివరించారు. సిఎం కేసీఆర్ దళితులను ఆదుకోవడానికి వారికి సముచిత స్థానం కల్పించడానికి దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టారని, ఇది నిరంతరం కొనసాగే ప్రక్రియ అన్నారు. ప్రచారంలో భాగంగా గొల్లమాట్ తండాకు వచ్చిన బాజిరెడ్డి గిరిజనులతో కలిసి హెూటల్లో చాయ్ తాగారు. మహిళలు మంగళహారతులు, బోనాలు, చేపల వలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రూరల్ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, మండల అధ్యక్షులు చింత శ్రీనివాస్, జడ్పీటీసీ దాసరి ఇందిరా లక్ష్మీనర్సయ్య, సర్పంచ్‌లు గడ్డం రాధాక్రిష్టారెడ్డి, సొసైటీ చైర్మన్ గజవాడ జైపాల్, ఉపసర్పంచ్ రవీందర్, ఖిల్లా రామాలయ చైర్మన్ మహేందర్‌రెడ్డి, శక్కరికొండ కృష్ణ, నల్లవెల్లి సాయిలు, పద్మారావు, గజవాడ రాములు, ప్రతాప్‌రెడ్డి, లొక్కిడి గిరి, సర్దార్, విఠల్ రాథోడ్, అంబర్‌సింగ్, ఫైజల్ పాషా, కోఆప్షన్ సభ్యులు నయీం, పవన్ దండుగుల సాయిలు, మోహన్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి

జక్రాన్‌పల్లి : నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని మరోసారి ఆశీర్వదిస్తే ప్రజాసేవకు అంకితమవుతానని బీఆర్ఎస్ నిజామాబాద్ రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మండలంలోని పుప్పలపల్లి, మాదాపూర్, గన్యతండ, సికింద్రాపూర్, బాల్‌నగర్, కేశ్‌పల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన బాజిరెడ్డి గోవర్ధన్‌కు ప్రజలు ఘనస్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులతో, బోనాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల రాజు, జడ్పిటిసి తనుజ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ముసుకు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నట్ట భోజన్న, మండల కోఆప్షన్ సభ్యుడు బుల్లెట్ అక్బర్ ఖాన్, రైతుబంధు మండల అధ్యక్షులు డికొండ శ్రీనివాస్, సర్పంచులు దావుల పోసాని సంతోష్, గన్యా తండా నూర్‌సింగ్ రాథోడ్, సికింద్రాపూర్ సర్పంచ్ తలారి గంగామణి గంగాధర్, కందుల చిన్న లింగన్న, మైదం మహేశ్వర్, ఒల్లపు నిహారిక ఈశ్వర్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పతికోసం సతీమణి ప్రచారం



నవతెలంగాణ-ధర్పల్లి

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా రూరల్ నియోజకవర్గంలోని ధర్పల్లి మండల కేంద్రంలో శనివారం రూరల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డా.భూపతిరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి వినోదిని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. తన భర్త కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న సందర్భంగా గొప్ప వైద్య వత్తిని వదులుకొని గత 23 సంవత్సరాలుగా ప్రత్యేక రాష్ట్రం కొరకు ఎన్నో ఉద్యమాలు చేసి అనేక కార్యక్రమాలు చేపట్టాడని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో పాలన విధానాలు నచ్చక కల్వకుంట్ల కుటుంబం పెత్తనంపై, అలాగే ఒంటెద్దు పోకడలతో స్వనిర్ణయాలతో కాలం గడుపుతున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని ఎదిరించారని తెలిపారు. తన ఎమ్మెల్సీ పదవిని వదులుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రజాసేవ సేవ చేసేందుకు ముందుకొచ్చారని వివరించారు. తనను ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, నాయకులు చెలిమెల నర్సయ్య, రాకేష్, రమణ, మిట్టపల్లి ప్రవీణ్, పుప్పాల సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

నియంతృత్వ, ఫాసిస్టు శక్తులను ఓడించండి

• కరపత్రాలు పంచుతూ ప్రచారం



మాట్లాడుతున్న డివిజన్ కార్యదర్శి దేవారం

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో ప్రజలు నియంతృత్వ, మతోన్మాద ఫాసిస్టు బీఆర్ఎస్, బిజెపి, ఎంఐఎంను ఓడించాలని సిపిఐఎంఎల్ డివిజన్ కార్యదర్శి దేవారం పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో దుకాణాల వద్ద కరపత్రాలు పంచు తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రజల చేతిలో వజ్రాయుధం లాంటిదని, దేశంలో, రాష్ట్రంలో మతోన్మాద ఫాసిజం నియంతృత్వంతో ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారని తెలిపారు. ఇక నిరుద్యోగుల ఉద్యోగ ఉపాధ్యాయుల విషయంలో మరింత దారుణంగా వ్యవహరించారని విమర్శించారు. కేంద్రంలో మతోన్మాదిగా మారిన బిజెపి దీనికి బీటీంగా పనిచేస్తున్న బిఆర్ఎస్, ఎంఐఎంలను ఓడించాలని అన్నారు. ప్రజాస్వామిక హక్కులకోసం నిలబడే వారికి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. కెసిఆర్ రెండు దఫాలుగా గెలిచినా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో కెసిఆర్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని అన్నారు. ప్రజలు ఈసారి మతతత్వ శక్తులు అయినా బిజెపి, నియంతృత్వ బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించి తగిన బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. పై మూడు పార్టీలను ఓడించగలిగే సమీప ప్రత్యర్థిని ఎంచుకోవాలని వారిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ నాయకులు ముత్తెన్న, సబ్ డివిజన్ కార్యదర్శి కిషన్, నాయకులు ఠాకూర్, రాజన్న, దుర్గాప్రసాద్, పిడిఎస్యు ఏరియా ప్రధాన కార్యదర్శి డి.నిఖిల్, పివైఎల్ జిల్లా కార్యదర్శి రవి, మనోజ్, ఐఎఫ్‌టీయూ నాజీర్, నిఖిల్, విజయ్, రాకేష్ పాల్గొన్నారు.

49వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం



నవతెలంగాణ-కంఠేశ్వర్

బి.ఆర్.ఎస్ పార్టీ ఎన్.ఆర్.ఐ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాల అంబర్‌పేట్, హతాయిగల్లీ, కసబ్‌గల్లీలో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కారు గుర్తుకి ఓటు వేసి గణేష్ బిగాలను గెలిపించి అభివృద్ధి సంక్షేమాన్ని కొనసాగించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో 49వ డివిజన్ బి.ఆర్.ఎస్ నాయకులు అంకార్ మహేష్, మాజీ కార్పొరేటర్ చంద్రభూషణ్, నాయకులు ముజాహిద్ బబ్బు, బిఎల్.రాజు, సయ్యాజి, సాండ్ రాజు, ఆకుల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్‌లోని నాగారంలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో శనివారం భారత గణతంత్ర్య ప్రవేశిక సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఉపన్యాస పోటీలు క్విజ్ పోటీలు నిర్వహించినట్టు తెలంగాణ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి, నిజామాబాద్ డిస్టిక్ యూత్ ఆఫీసర్ శైలి బెల్లాల్ కార్యక్రమంలో పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ సైదా జైనబు తెలిపారు. డాక్టర్ రవీందర్‌రెడ్డి భారత రాజ్యాంగం హక్కులు, విధులు, నేటి సమాజంలో యువతకు వాటి విలువలు, వాటిని నిత్య జీవితంలో ఏ విధంగా అన్వయించుకోవాలని, చుట్టూ ఉన్న పరిసరాల పరిశుభ్రత పాటించడం పట్ల, విద్య అవకాశాలు వివిధ విషయాలపై అవగాహన కల్పించారు. శైలి బెల్లాల్ కళాశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలిచిన వారికి బహుమతులు సర్టిఫికెట్స్ అందజేశారు. తెలంగాణా విశ్వవిద్యాలయం తరపున నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ కొరకు గుజరాత్‌కు వెళ్లి అక్కడ కల్చరల్‌లో రెండవ బహుమతి సాధించి వచ్చిన కవితకు సన్మానం చేసినట్టు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వీ.జీ లక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ సైదా జైనబ్ తెలియజేశారు.

ఓటర్ అవగాహన ర్యాలీ



నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని దాస్‌నగర్ సమీపంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి ఎమ్.సరిత ఆధ్వర్యంలో కళాశాల నుంచి మాణిక్ బండారు తండా వరకు ఓటు అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలకు ఓటు హక్కును వినియోగించుకోవాలని చైతన్య పరిచారు. నోటుకు ఓటు మనకే చేటు అని నినాదిస్తూ మాణిక్‌బండారు తండాలో ఫ్లాష్‌మాబు నృత్య రీతి ద్వారా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, సరైన పాలకులను ఎన్నుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య, వాసవీలత, పద్మమ్మ, సునీత, అనిత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. గత తొమ్మిది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్టానికి చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి, నియోజకవర్గంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను ఓటంకు వివరిస్తూ పార్టీ నాయకులు కారు గుర్తుకు ఓటెయ్యాలని ఈ సందర్భంగా కోరారు. ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ-నర్సారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ ప్రచారంలో పాల్గొన్నారు. బాల్కొండ నియోజకవర్గానికి వేముల ప్రశాంత్‌రెడ్డి చేసిన అభివృద్ధిని మరవకుండా ఓటు వేసి మళ్ళీ ప్రశాంత్ రెడ్డిని తిరిగి బాల్కొండ ఎమ్మెల్యేగా గెలుపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ముస్కు భూమేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ సామ పద్మ-వెంకటొండ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ-నర్సారెడ్డి, ఆయా గ్రామ శాఖల అధ్యక్షులు, మండల, గ్రామ స్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

పట్టణంలో బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-ఆర్మూర్

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మున్సిపల్ కౌన్సిలర్ సంగీతా ఖాందేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని 2వ వార్డులోని రంగాచారి నగర్, చేనేత కాలనీ, జిరాయత్ నగర్ ప్రాంతాల్లో ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డిని ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రచారం చేశారు. కౌన్సిలర్ ఇంటింటికి తిరుగుతూ మహిళలకు బొట్టు పెడుతూ, బీడీలు చుడుతూ వినూత్న ప్రచారం నిర్వహిం చారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఖాందేష్ సత్యం, జాగృతి నియోజకవర్గ కన్వీనర్ మక్కల సాయినాథ్, నాయకులు రాసురి నరేశ్, నేరగొండ సాయి, పసుపుల బిక్షపతి, పసుపుల సురేష్, సత్యనారాయణ, గోక శరత్, విష్ణు, పీట్ల శ్రీను, వినోద్, వెంకటి, రవి గోదావరి, రుకుంబాయ్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలా.. ఉయ్యాలా..

● సీతానగరిపై డోల సేవ ● పరవశించిన భక్తజనం

నవతెలంగాణ-భీంగల్

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం లింబాద్రి గుట్టపై శ్రీ లక్ష్మీ నసింహుని కార్తీకమాస బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి సీతానగరిపై డోల సేవ శోభయమానంగా నిర్వహించారు. అలర చంచలమైన ఆత్మలందుండి నీ అలవాటు చేసేనే ఉయ్యాలా.. ఉయ్యాలా అంటూ పాటలు పాడుతూ ఆ దేవదేవుని డోల సేవలో అర్చకులు మునిగితేలారు. అలాంటి అద్భుత సన్నివేశం (డోలసేవ) తిలకించిన భక్తజనం ఆనందపరవశంలో మునిగి తేలారు. స్వామివారి ఆలయానికి పశ్చిమ వైపున ఉన్న జోడు లింగముల మార్గమునకు వెళ్లే దారిలో ఉన్న సీతా నగరములో ఉన్న నాలుగు స్తంభముల రాతి మండపంలో డోల సేవ చేపట్టారు. శ్రీ లక్ష్మీ నసింహుని ఉత్సవ విగ్రహములను పల్లకిలో వేద మంత్రోచ్చరణముల మధ్య మేళ తాళలతో సీతానగర మండపానికి తీసుకోచ్చి కన్నుల పండువగా డోలసేవ నిర్వహించారు. లాలి పాటలు పాడుతూ స్వామికి డోల సేవ జరిపారు. స్వామి తిరుగు ప్రయాణంలో జోడు లింగముల కేదురుగా స్వామిని నిలిపి, ఆ శ్రీ లక్ష్మీ నసింహుని నుంచి జోడు లింగముల దర్శనం చేసుకున్నారు.

విద్యార్థినీలు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా అధికార సంస్థ చైర్మన్ సునీత కుంచాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

విద్యార్థినీలు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా అధికార సంస్థ చైర్మన్ సునీత కుంచాల అన్నారు. శనివారం నిజామాబాద్ నగరంలోని కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయ సమావేశం మందిరంలో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఎంతో జాగ్రత్తగా ఉన్నప్పటికీ రోజు ఏదో ఒక దగ్గర హింస జరుగుతుందని ముఖ్యంగా కాలేజీ విద్యార్థుల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినప్పుడు వారు సమాచారాన్ని కుటుంబ సభ్యులతో గానీ, తనకు మేలు చేసే వారితో పంచుకోవాలని అన్నారు. అంతేకాకుండా విద్యార్థినీలు ప్రశ్నించే తత్వాన్ని అలపరుచుకోవాలని దాని వల్ల విద్యార్థులపై ఇన్సర్ట్ చేయడానికి ఎవరైనా భయపడతారని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులు ఎవరైనా తమ ఫోటోలను తీసి తమను వేధించినట్లయితే 1930 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని అప్పుడే మహిళలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. జిల్లా కేంద్రంలో సఖి కేంద్రం బాలికల కోసం, మహిళల కోసం పనిచేస్తుందని ఎవరైనా హింసకు గురైనప్పుడు సఖి కేంద్రాన్ని ఆశ్రయించి సహాయం పొందాలని కోరారు. స్నేహ సొసైటీ సఖి కేంద్రానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరూ తమ ప్రసంగాల ద్వారా స్త్రీ ఇంతకు వ్యతిరేకంగా అవగాహన కల్పించడం ఒక ఎత్తు అయితే కాలేజీ విద్యార్థినీలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా చక్కటి ప్రదర్శన చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి ఫ్యామిలీ కోర్ట్ న్యాయమూర్తి ఆశాలత, నిజామాబాద్ ఏసిపి కిరణ్ కుమార్, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, తెలంగాణ యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతి త్రివేణి, జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బి, గౌరవ అధ్యక్షురాలు, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహిళలకు తెలంగాణ యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతి త్రివేణి, గైనకాలజిస్ట్ అపర్ణ, స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, మహిళా పారిశ్రామిక వేత్త గోపిక జాతీయ అవార్డు గ్రహీత కవితలకు ఘనంగా సన్మానించారు. కళాశాల విద్యార్థులకు జ్ఞాపికాలను ప్రధాన చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ సునీత కుంచాల

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

● ఆర్మూర్ కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలోని ఆర్మూర్, గోవింద్‌పేట్, అంకాపూర్ గ్రామాల్లో శనివారం రాత్రి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలను మోసం చేశాడని అన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని అన్నారు. కమీషన్లకు సంబంధించిన పనులను చేశాడని, ఎమ్మెల్యే వెనుకాల ఉన్న చోటామోటా నాయకులు దౌర్జన్యంగా కబ్జాలు చేశారని అన్నారు. ఎవరైనా ఎదిరిస్తే కేసులు పెట్టి నానా హింసలు చేశారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలి

● నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

శాసనసభ సాధారణ ఎన్నికలు-2023 జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న పోలింగ్‌న, డిసెంబరు 3న కౌంటింగ్‌న సిటీ పోలీసు యాక్ట్ 1348లోని సెక్షన్ 22(1)(ఏ) నుంచి (ఎఫ్), 22 (ఏ నుంచి ఇ), 22(3) ప్రకారం నిషేధ తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఎన్నికల సందర్భంగా నిషేధించిన పలు అంశాలను వెల్లడించారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులతో సమావేశం, ఊరేగింపు ఓటర్లను ప్రభావితం చేయడానికి రాజకీయ పార్టీ బ్యానర్లు/లోగోలు ఉన్నా, లేకున్నా, ఇంకా ఏమైనా ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాజకీయ లేదా ఇతరులు జిల్లాలో ప్రచారం కోసం లేదా ఓటింగ్ కోసం మైకుల ద్వారా ఓటర్లను ప్రభావితం చేయడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం, కల్లు, ఇతర మత్తు పదార్థాలు వినియోగించడం, మద్యం, కల్లు పంపిణీ వివిధ సంఘాలు లేదా వ్యక్తుల మధ్య మతపరమైన శత్రుత్వం, ద్వేషం సష్టించడం, నేరానికి పాల్పడే అవకాశం ఉన్న చిత్రాలు, చిహ్నాలు, ప్లకార్డులు, ప్రసంగాలు చేసి గొడవలు సష్టించడం జరిగితే చర్యలు తప్పవని, చట్టబద్ధమైన అధికారానికి భంగం కలిగించడం అన్ని పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో ఎన్నికల నిర్వహణకు అంతరాయం కలిగించడం వీడీసీలు, కులపెద్దలు రాజకీయ పార్టీలకు అనుగుణంగా ఓటర్లతో ప్రమాణం చేయించడం వంటివి జరిగితే ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రశాంతంగా 'ఓట్ ఫ్రమ్ హెూం'

నవతెలంగాణ-ముప్కాల్

80 ఏండ్లు దాటిన వద్దులు, వికలాంగుల కోసం ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తెచ్చిన 'ఓట్ ఫ్రమ్ హెూం' మండలంలో ప్రశాంతంగా కొనసాగింది. 'ఓట్ ఫ్రమ్ హెూం' కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు ఎన్నికల సిబ్బంది వెళ్లి శనివారం రోజు ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మంత్రి వేముల సమక్షంలో

బీఆర్ఎస్‌లోకి చేరికలు

● గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన మంత్రి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

సీఎం కేసిఆర్ జనరంజక పాలన, బాల్కొండ నియోజకవర్గంలో జరిగిన అభివద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులు, యువకులు ఇతర పార్టీ కార్యకర్తలు రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో... వెల్కటూర్ గ్రామానికి చెందిన యువజన సభ్యులు, ఏర్గట్ల గ్రామానికి చెందిన యువకులు కాంగ్రెస్ పార్టీ నుండి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వేల్పూర్ మండల కేంద్రంలో ఆటో యూనియన్ సభ్యులు బీఆర్ఎస్ పార్టీకి తమ మద్దతు తెలియజేశారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి మంత్రి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సమక్షంలో పలువురు చేరిక

శ్రీ సరస్వతి విద్యామందిర్‌లో మాక్ పోలింగ్

నవతెలంగాణ-భీంగల్

శ్రీ సరస్వతి విద్యా మందిర్ పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు, ఓటును ఏ విధంగా వినియోగించుకోవాలో తెలియజేసేందుకు మాదిరి ఎన్నికలను (మాక్ పోలింగ్)ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఎన్నికలలో బాలికల విభాగం నుంచి 4గురు, బాలుర విభాగం నుంచి 4గురు విద్యార్థులు పోటీ చేస్తూ తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఆ తర్వాత పోటీ చేస్తున్న వారు తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి తమకు ఓటు వెయ్యాలని ప్రచారం నిర్వహించారు. తర్వాత విద్యార్థులే స్వయంగా ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారి బాధ్యతలను నిర్వర్తించి ఓటింగ్ విధానాన్ని చేపట్టగా 6 తరగతి నుంచి 10 తరగతి విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నా రు. ఓటింగ్ విధానం పూర్తయిన తర్వాత కౌంటింగ్ నిర్వహించగా బాలుర విభాగం నుంచి పదవ తరగతి విద్యార్థి ఆర్.అశ్వంత్ గెలుపొందగా, బాలికల విభాగం నుంచి పదవ తరగతి విద్యార్థిని సిహెచ్. సదాశ్రీ గెలుపొందింది. ఈ విద్యార్థులకు రిటర్నింగ్ అధికారి ధ్రువీకరణ పత్రాలను అందజేశా రు. ఈ సందర్భం గా గెలుపొందిన విద్యార్థులను, ఈ ఎన్నికల కోసం విద్యార్థులను సంసిద్ధులు చేసిన సోషల్ ఆచార్య బందమగు పి.సాయిచరణ్, టి.శ్రీవాణి, ఎస్.స్రవంతి, పి.రాజేందర్, డి. సుబజ,శిరీష, పల్లెర్ల మంజుల, ఎస్. అర్చన, వై.సునీల్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయు లు రవికుమార్, జి.నర్సారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయబృందం అభినందించారు.



మాక్ పోలింగ్ న్విహిస్తున్న విద్యార్థులు

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సునీల్ రెడ్డి సతీమణి

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో శనివారం ఉదయం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి సతీమణి ముత్యాల దీప్తి రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చేతు గుర్తుకు ఓటు వేసి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను ఈ సందర్భంగా కోరారు. ప్రజల మధ్య ఉంటూ, ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేస్తున్న ముత్యాల సునీల్ కుమార్ రెడ్డిని బాల్కొండ నియోజకవర్గ ప్రజలు మరిచిపోకుండా గెలుపించుకుంటారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న సునీల్‌రెడ్డి సతీమణి

విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన



మాక్‌పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజన విరామం సమయంలో పాఠశాల విద్యార్థినిలకు "మాక్ పోలింగ్" నిర్వహణపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించినట్టు పాఠశాల ఎస్వో జి.వినోద అన్నారు. ద్యార్థినిలకు ఎలక్షన్ నిర్వహణ, ఓటింగ్‌లో ఎలా పాల్గొంటారో తెలిపారు. పాఠశాల విద్యార్థినిలు ఉత్సాహంతో ఈ ఓటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన బీఆర్ఎస్ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-ధర్పల్లి

బీఆర్ఎస్ పార్టీ గ్రామగ్రామాన ప్రచారం జోరందుకుంది. ఎంపీపీ నల్ల సారిక హన్మంత్‌రెడ్డి శనివారం మండలంలోని హొన్నాజీపేట్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు చేసిన అభివృద్ధి పనులకు వివరిస్తూ రానున్న రోజుల్లో జరగబోయే అభివృద్ధిని ప్రజలకు వివరించారు. రాజగబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, ఎంపిటిసి లక్ష్మి, వార్డు సభ్యులు, గ్రామ కమిటీ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

షబ్బీర్‌అలీని గెలిపించండి : టీడీపీ



ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

చేతిగుర్తుకు ఓటు వేసి షబ్బీర్‌అలీని గెలిపించాలని తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ నాయకులు తెలిపారు. షబ్బీర్ అలీకి మద్దతుగా దుబ్బ సంజీవయ్య ప్రాంతంలో ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 6 గ్యారంటీలను ఖచ్చితంగా ఇస్తుందని ప్రతి ఒక్కరికి వివరించారు. షబ్బీర్‌అలీని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు నిర్దేశించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని, గ్యాస్ సిలిండర్ రూ.500కి ఇస్తారని అన్నారు. కార్యక్రమంలో రెంజర్ల సురేష్, అంబిక సత్యనారాయణ, లవంగ రాజు, అశోక్ అర్మపల్లి, రమేష్ గౌడ్, గంగాధర్ చెరుకు, గంగొనే రాజేశ్వర్, రవికుమార్ పాటిల్, యూసఫ్, లక్ష్మి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తో ప్రజలు విరక్తి చెందారు

- మండవ వెంకటేశ్వరరావు
- కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి



మాట్లాడుతున్న మాజీ మంత్రి మండవ

నవతెలంగాణ-మోపాల్

బీఆర్ఎస్‌తో ప్రజలు విరక్తి చెందారని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం రాహుల్ గాంధీ సమక్షంలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రూరల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భూపతిరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రస్తుత బీఆర్ఎస్ ప్రభుత్వంపైన ప్రజలు విరక్తి చెందారని ఎక్కడ చూసినా కూడా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని అన్నారు. ధనిక రాష్ట్రమని చెప్పుకుంటున్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దింపిన ఘనత ప్రస్తుత బీఆర్ఎస్ సర్కార్‌దేనని ఆయన విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో పోరాడిన వారికి బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గుర్తింపు లేదని అన్నారు. తెలంగాణ పోరాట యోధులు ఆఖరికి గద్దర్, అందెశ్రీ లాంటి వారు కూడా కేసీఆర్‌ను విమర్శిస్తున్నారని చెప్పారు. తాను ఈ విషయం ఆవేశంతో చెప్పడం లేదని ఎంతో ఆలోచించిన తర్వాతనే రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరానని తెలిపారు. రూరల్ నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ చేతి గుర్తుకు ఓటు వేసి డాక్టర్ భూపతిరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో చాలా కష్టపడ్డాడని తెలంగాణ ప్రజల కోసం తన ఎమ్మెల్సీ పదవిని కూడా వదులుకున్నాడని అటు వంటి గొప్ప వ్యక్తిని ప్రతి ఒక్కరు తమ అమూల్య మైన ఓటు వేసి గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. అనంతరం భూపతిరెడ్డి మాట్లాడుతూ.. మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు మండవ వెంకటేశ్వర్‌రావు కాంగ్రెస్ పార్టీలో చేరడం చాలా శుభ పరిణామమని అన్నారు. ఆయన చేరికతో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడిందని ఆయన సేవలు పార్టీకి అవసరమని తెలిపారు. ముఖ్యంగా మన నియోజకవర్గ ప్రజలకు కూడా ఆయన సేవలు అవసరమని ఆయన సూచనలు సలహాలు తీసుకొని ఇంకా గొప్పగా పార్టీని బలోపేతం చేద్దామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నగేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి, శేఖర్ గౌడ్, మనోహర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్.. ఉద్యమాల గడ్డ

- జిల్లా ప్రజలు నిప్పు కనికలు
- స్వతంత్ర అభ్యర్థి మేత్రి రాజశేఖర్
- అర గుండు, అర మీసంతో ప్రెస్‌మీట్



మాట్లాడుతున్న స్వతంత్ర అభ్యర్థి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లా అంటే ఉద్యమాల గడ్డ అని, నిజామాబాద్ జిల్లా ప్రజలు నిప్పు కనికలని నిజామాబాద్ రూరల్ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి మేత్రి రాజశేఖర్ తెలియజేశారు. అర గుండు, అర మీసంతో బిచ్చగాడి రూపంలో శనివారం నగరంలోని నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కొట్లాడిన తెగువని మర్చిపోయి అబద్ధాలకు, బూటకపు మాటలకు కుల-మత రాజకీయాలకు తలొగ్గి ప్రజలు పౌరుషాన్ని చంపుకుంటున్నారని, తాను సగం మీసం, సగం గడ్డంతో కండ్లు తెరిపించే ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. అనాలోచిత విధానాలతో గుండులో గుజ్జు లేకుండా పాలన చేస్తున్న పార్టీల నుంచి అప్రమత్తంగా ఉండాలని అరగుండుతో ప్రచార నిరసన చేస్తున్నానని అన్నారు. 2 కోట్ల ఉద్యోగాలకు ముహూర్తం దొరకలేదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం అధికారంలో ఉండి 500లకు సిలిండర్ ఇవ్వడం లేదని, కానీ మ్యానిఫెస్టోలో పెట్టడం పెద్ద అబద్ధమే అని తెలిపారు. కులాలు మతాల పేరుతో రాజకీయం చేసేటోళ్లు మతాల మధ్య గొడవలు పెట్టేటోళ్లు బీసీని ముఖ్యమంత్రి చేస్తానంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. కనుక యువత, ప్రజలు కండ్లు తెరచి కెమెరా గుర్తు మీద ఓటు వేసి గెలిపించి తనను అసెంబ్లీకి పంపాలని కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 15 తులాల బంగారం అపహరణ



తెరిచి ఉన్న బీరువా తలుపులు

నవతెలంగాణ-ఆర్మూర్

తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని బీచ్‌గల్లీకి చెందిన గోక లత తండ్రి మృతి చెందడంతో అంత్యక్రియలకు నాగంపేటకు వెళ్లి పది రోజులుగా అక్కడే ఉండగా, ఇంటికి తాళం వేసి ఉంది. ఉదయం లత వదిన స్వరూప వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయని సమాచారం ఇవ్వగా లత ఇంటికి వచ్చి చూడగా బీరువాలను పగలగొట్టి అందులో నుంచి 15 తులాల బంగారం, 20 తులాల వెండి, మూడువేల నగదును అపహరించుకుపోయారు. ఒకే దగ్గర ఉంచిన అన్నదమ్ములు, అక్క బంగారం ఎత్తుకెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

ముగిసిన జిల్లా కబడ్డీ అసోసియేషన్ సీనియర్ బాలికల ఎంపిక

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సీనియర్స్ బాలికల ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. రాష్ట్రస్థాయి పోటీల కోసం జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక డీఎస్ఏ మైదానంలో బాలికల ఎంపికలు నిర్వహించామని జిల్లా ప్రధాన కార్యదర్శి అంధ్యల లింగయ్య తెలిపారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి సుమారు 200 మందికిపైగా క్రీడాకారులు ఈ ఎంపికలో పాల్గొనడం గమనార్హం. అయితే వీరికి ఇండెక్స్ ఆధారంగా ప్రమాణాలు నమోదు చేసుకొని అర్హులైన వారిని ఎంపిక చేశారు. వీరికి బసాపూర్‌లో శిక్షణ శిబిరం నిర్వహించి అద్భుత ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణిలను ఎంపిక చేసి తుదిజాబితా వెల్లడిస్తామని తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 4 నుంచి 7వరకు నిజామాబాద్ జిల్లా బుస్సాపూర్‌లో జరగబోయే 70వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల కబడ్డీ సీనియర్స్ బాలికల ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ సంఘం ప్రతినిధులు సాయగౌడ్, సుబ్బారావు, సురేందర్, గంగాధర్, రాజకుమార్, జిల్లా కబడ్డీ కోచ్ మీసాల ప్రశాంత్, అనురాధ, సువర్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు సుమన్, వినోద్, సాయిలు, సందీప్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ ప్రచారం



ప్రచారం చేస్తున్న చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని 33, 35 వార్డుల్లో ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్, వార్డ్ 35 ఇంచార్జీ సడక్ వినోద్, బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్తలు, వార్డు సభ్యులు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి పాఠశాలలో ఓటర్ అవగాహన ర్యాలీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో శనివారం ఓటర్ల అవగాహన కల్పించేందుకు విద్యార్థులు పాఠశాల నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఓటు విలువను చెబుతూ నినాదాలు చేశారు. విద్యార్థులు చేసిన స్కిట్ అందరిని ఎంతగానో అలరించింది. కార్యక్రమంలో భాగంగా ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ మీనాజ్ ఓటు విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ విజయ్ కర్తన్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

c
m
y
k

ఉదయం ఓ పార్టీ.. రాత్రికి మరోపార్టీ

• అపహాస్యమవుతున్న చేరికలు

నవతెలంగాణ-గాంధారి

చేరికలతో తమ బలం పెరుగుతుందని నాయకులు చూపించుకునే ప్రయత్నంలో అభాసుపాలువుతున్నారు. అదే వ్యక్తులకు ఉదయం ఓ పార్టీ, రాత్రి మరో పార్టీ కండువా కప్పుతుండటంతో అపహాస్యమవుతుంది. గాంధారి మండలంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉదయం వేళ కాంగ్రెస్‌లో చేరి మరుక్షణమే అప్రమతమైన బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థుల మెప్పు కోసం మళ్లీ బిఆర్ఎస్‌లో చేర్పిస్తున్నారు. ఇలా పొద్దున ఒక పార్టీలో రాత్రి మరో పార్టీలో ప్రజా ప్రతినిధులు నాయకులు చేరుతుండటంతో ఎప్పుడు ఎవరు ఏ పార్టీలో ఉంటున్నారో ఏ పార్టీలో నుంచి వెళ్ళిపోతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అప్పుడే చేతు గుర్తుకు ఓటు వేయమని చెప్పిన నాయకులు తెల్లారితే మళ్లీ కారు గుర్తుకు ఓటు వేయమని చెప్పుండటంతో ఓటర్లు ముక్కున వేలేసుకుంటున్నారు.




ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక.. అనంతరం కాంగ్రెస్‌లోకి..

తమ్ముడు గెలుపు కోసం అక్క ప్రచారం



ప్రచారం చేస్తున్న జడ్పిటిసి శ్రీలత

నవతెలంగాణ-లింగంపేట్

తమ్ముడు మదన్‌మోహన్‌రావు గెలుపు కోసం అక్క శోభ మండలంలోని మోతెలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉదయం లింగంపేట్ జెడ్పిటిసి శ్రీలత సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్మోహన్‌రావు అక్క శోభ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమె వెంట తిరుగుతూ కాంగ్రెస్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో సంబంధించిన కరపత్రాలను ఓటర్లకు అందజేస్తూ తమ అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్మోహన్ గెలిపించాలని ఓటర్లను వేడుకున్నారు. ఈ ప్రచారంలో లింగంపేట్ జెడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రాజు, మైనార్టీ నాయకులు రఫీయుద్దీన్, గ్రామ కమిటీ అధ్యక్షులు శంకర్‌రావు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న యాదవరెడ్డి

నవతెలంగాణ-రాజంపేట్

మండల కేంద్రంలోని చాకలి బజారు సాయిలు శనివారం మృతి చెందారు. వారి అంత్యక్రియల నిమిత్తం కాంగ్రెస్ పార్టీ తరపున 5000 రూపాయలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాదవ రెడ్డి అందజేశారు. కుటుంబానికి అన్నివేళలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు విరన్న, కిసాన్ సెల్ అధ్యక్షులు జుకంటి సుధాకర్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు గంగాధర్ గౌడ్, వార్డ్ నెంబర్ ఇమ్రాన్ అలీ, ఎన్ ఎస్ యు ఐ జామిల్, బీసీ సెల్ సిద్ధరాములు, అక్బర్ బోయిని రమేష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

• ఎంపీటీసీ కుమారుడు మృతి

• ఒకరి పరిస్థితి విషమం..

నవతెలంగాణ-గాంధారి

ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉండగా.. ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన గాంధారి శివారులో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఈ ఘటన మండలంలోని సీతాయిపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ కుమారుడు మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గాంధారి మండల కేంద్రంలో గృహ ప్రవేశ వేడుకకు హాజరై అర్ధరాత్రి తర్వాత గాంధారి నుంచి కామారెడ్డికి కారులో వెళ్తుండగా.. కారు చెట్టును ఢీకొనడంతో గాంధారి మండలంలోని సీతాయిపల్లికి చెందిన ఎంపీటీసీ శ్రీనివాస్ కుమారుడు హరిచంద్ర ప్రసాద్(24) అక్కడికక్కడే మృతిచెందాడు. మండల కేంద్రానికి చెందిన కొత్తరే కృష్ణమోహన్ పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. గంభీరావు పేట గ్రామానికి చెందిన శివంది శివ కామారెడ్డి చెందిన కాసుల శశిలకు తీవ్ర గాయాలయడంతో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



చెట్టును ఢీకొన్న కారు

గంటకు ఐదుగురు మహిళలపై హింసా

నవతెలంగాణ-సదాశివనగర్

ఇన్‌స్ఫైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సదాశివనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో శరనివారం అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. నిర్వాహకులు అమృత రాజేందర్ మాట్లాడుతూ బాలికల పట్ల మహిళల పట్ల అనేకరకాలుగా సమాజంలో ప్రతీ రోజు హింస పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గృహ హింస, శారీరక హింస, మానసిక హింస, లైంగిక హింస ఘటనలు కొనసాగుతున్నట్టు తెలిపారు. గంటకు 5 గురు మహిళలు సమస్యలలో ఉంటున్నారని, మనం అందరం కలిసి ముక్త కంఠంతో మహిళల పట్ల జరుగుతున్న హింసను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. బాలికలు, మహిళల పట్ల సమాజంలో పాఠశాలలో కళాశాలలో వేదింపులకు గురైతే షీ టీమ్ 8712686094 నంబర్, పోలీస్ సిబ్బంది 100కి మహిళ హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కు తెలియజేయాలి అని సూచించారు.



మాట్లాడుతున్న విద్యార్థిని

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ మండల ఉపాధ్యక్షులు

నవతెలంగాణ-నిజాంసాగర్

బీజేపీ మండల ఉపాధ్యక్షులు ఒంటరి నారాయణ రెడ్డి.. ఎమ్మెల్యే హనుమంతు షిండే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా షిండే మాట్లాడుతూ బీఆంఎస్ లో భారీగా చేరికలు పెరుగుతున్నట్టు తెలిపారు. కేసీఆర్ చేసిన మంచి పనులను ప్రజలందరూ గుర్తిస్తున్నారని ఆయన అన్నారు. సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఆయన గుర్తు చేశారు. మొన్న చెప్పినట్టుగానే ఇంకొన్ని రోజులలో బిజెపికి కాంగ్రెస్ కు క్యాడర్ కూడా మిగలదని ఆయన ఎద్దేవా చేశారు. భారీ మెజార్టీతో బీఆర్ఎస్ పార్టీ గెలువబోతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు దుర్గా రెడ్డి, వైస్ ఎంపీపీ మనోహర్, మల్లూరు సొసైటీ చైర్మన్ విట్టల్ రెడ్డి, బాబు సెట్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీస్తున్న ఎన్నికల అధికారి

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని ఆరేపల్లి గ్రామాల్లోని 153 పోలింగ్ బూత్ ను శనివారం ఎన్నికల ప్రత్యేక పర్యవేక్షణ అధికారి జగదీష్ పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులతో ఓటర్ స్లిప్స్ డిస్ట్రిబ్యూషన్ పంపిణీపై రివ్యూ చేసి, సంబంధిత రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్ కుమార్, ఆరేపల్లి గ్రామపంచాయతీ సెక్రటరీ ప్రశాంత్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో తండాల్లో కాంగ్రెస్ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టబోయే సంక్షేమ పథకాలు అమలు చేసే ఆరు గ్యారెంటీ పథకాలను గడపగడపకు వివరించారు. సోమ్లా నాయక్ తండాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉమ్మాజి భాస్కర్ రావు, నాయకులు భూర్గుల్ నర్సయ్య, బల్వంత్ రావు, సంతోష్, మిథ్య, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీటీసీకి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని సీతాయిపల్లి గ్రామ ఎంపిటీసీ శ్రీనివాస్ కుమారుడు హరిచంద్ర ప్రసాద్ ప్రమాదవశాస్తు రాత్రి రోడ్డు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్ వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని చిన్న పోతంగల్ గ్రామానికి చెందిన అట్కారి భూమయ్య అదృశ్యమైనట్టు పోలీసులు తెలిపారు. గత 8 రోజుల క్రితం కూతురి కొడుకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో హైదరాబాద్‌లో చికిత్స నిమిత్తం వెళ్లారు. హైదరాబాదులో ఆస్పత్రిలో ఉంటున్న భూమయ్య మంగళవారం నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. బంధువుల ఇళ్లలో ఎక్కడ వెతికిన ఆచూకీ లభించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.



భూమయ్య

ఆదరించండి.. మరింత అభివృద్ధి చేస్తా

• ఎమ్మెల్యే జాజాల సురేందర్



నవతెలంగాణ-గాంధారి

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టానని, మరోసారి ఆదరించి గెలిపిస్తే.. మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గాంధారి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఎంతో మందికి ఆస్పత్రి విషయంలో ఆదుకున్నానని నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించానని మరోసారి తనను ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని ప్రజలకు సేవకునిగా ఉంటానని తెలిపారు. ప్రజల కష్టసుఖాలు తనకు తెలుసునని నేను స్థానికంగా ఉంటున్నానని ప్రజలకు ఏ కష్టం వచ్చినా అక్కడ వాలిపోతున్నానని తెలిపారు. మూడు రోజులు ఎల్లారెడ్డిలో ఆరు నెలలు అమెరికాలో ఉండే వ్యక్తిని కానని కష్టమైనా నష్టమైన ఎల్లారెడ్డి నియోజకవర్గంలోనే ఉంటున్నా అని అన్నారు.

గాంధారి: గాంధారి మండల కేంద్రంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు మమ్మాయి సంజీవ్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ ఫలాలను చూసి కారు గుర్తుకు ఓటు వేసి సురేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పెద్దపురి సాయికుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ రెడ్డి రాజులు, కోఆప్షన్ నెంబర్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని అన్నారం గ్రామ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులతో పాటు గ్రామస్తులు శనివారం స్థానిక జెడ్పిటిసి నా రెడ్డి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జగదీశ్వర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కడువ కప్పుకొని పార్టీలో చేరారు. చేరిన వారిలో కమ్మరి శ్రీనివాస్, లింగం, కమ్మరి నర్సింలు, కమ్మరి చంద్రం, భాస్కర్ తదితరులు ఉన్నారు.



ప్రచారం చేస్తున్న బిఎల్ఎఫ్ నాయకులు

గోదావరి జలాలు మళ్లిస్తా

- రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తా
- బీఎల్ఎఫ్ అభ్యర్థి సిరిగాధ సిద్దిరాములు

నవతెలంగాణ-కామారెడ్డి

తనను గెలిపిస్తే కామారెడ్డి జిల్లా కేంద్రం లో మహిళా డిగ్రీ కాలేజీతో పాటు పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటుకు కృషి చేస్తానని బిఎల్ఎఫ్ అభ్యర్థి సిరిగాధ సిద్ధరాములు హామీ ఇచ్చారు. కామారెడ్డి పట్టణంలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కామారెడ్డి పట్టణంలో శివాజీ విగ్రహం నుండి సిరిసిల్ల రోడ్ వరకు, పాత కామారెడ్డిలో, దేవునిపల్లిలో, నిజాంసాగర్ చౌరస్తా మీదుగా మొత్తంగా 10 బృందాలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కామారెడ్డి నియోజకవర్గానికి ఎలాంటి నదులు, కాలువల సదుపాయం లేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు, గోదావరి జల్లలు వచ్చే విధంగా పోరాడి సాధిస్తానన్నారు. కామారెడ్డి పట్టణనికి రోడ్లు, డ్రైనేజీ ల కోసం ఎన్ని కోట్లు విడుదలైన ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంద ని, వీటిని ఆధునీకరించేందుకు కృషి చేస్తానన్నా రు. ఇండ్లలేని నిరుపేదలను గుర్తించి వారికి ఇంటి జాగతో పాటు ఇల్లు నిర్మాణం చేపట్టేందు కు కృషి చేస్తానన్నారు. సిరిసిల్ల రోడ్‌లో ఆయన సతీమణి సబితా తన టీంతో ప్రచారం నిర్వహి స్తూ పేదల కోసం కష్టపడుతూ, పేద ప్రజలే తన కుటుంబంగా భావిస్తున్న సిద్ధరములను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో జూకంటి ప్రమీల, శిరీష, నాంపల్లి, ధర్మారెడ్డి, రఘుపతి రెడ్డి, యశోద, స్వప్న, మన్నే శోభ, గంగమని, విజయ్, మురళి, సిద్ధమ్మ, సైనజ్, తలారి, స్వామి, బాబు, నందు, సిరిగాధ భూమయ్య,బిక్కనూర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే గోరుమాటిలకు ఆత్మగౌరవం

- ఎమ్మెల్యే హన్మంత్ షిండే

నవతెలంగాణ-పిట్లం

బీఆర్ఎస్ పార్టీతోనే గోరుమాటిలకు ఆత్మ గౌరవం దక్కిందని ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. శనివారం మండలంలోని జగదాంబ తండా, సీతారాం తండాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోరుమాటిల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించడమే కాకుండా రాష్ట్ర రాజధానిలో బంజారా భవనం నిర్మిస్తున్నామన్నారు. గిరిజనులకు 6 శాతం ఉన్న రిజర్వేషన్ తమ ప్రభుత్వం 10 శాతానికి పెంచినట్టు తెలిపారు. తమ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే 2016 రూపాయలు ఉన్న ఆసరా పెన్షన్లను ఏప్రిల్ మాసం నుండి 3016 రూపాయలకు పెంచి ఇస్తూ సంవత్సరానికి 500 రూపాయలు పెంచుతూ 5016 రూపాయలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్ కామారెడ్డి జిల్లా నుండి పోటీ చేస్తున్నందున తాండాలలో అవసరమైన ఇండ్లు మంజూరి చేసుకోవచ్చునని తెలిపారు. 20 సంవత్సరాలనుండి ప్రజల సేవలో ఉన్నందున 3 సార్లు గెలిపించగా మీలో ఒకనిగా ఉంటూ సేవలందిస్తూ పనిచేస్తున్న నని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వాసవి రమేష్, జడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి , పౌరా దేవి ఆలయ శివ మహారాజ్ , బంజారా సంఘం అధ్యక్షులు బధ్యానాయక్ , సీనియర్ నాయకులు కుమ్మరి రాములు , ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న హన్మంతుషిండే

కేసీఆర్ ఇంటర్నేషనల్ కుట్రదారుడు

- అవినీతి మంత్రిని ఇంటికి పంపుదాం
- కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ విజయశాంతి



నవతెలంగాణ-బాల్కొండ

కేసీఆర్ ఇంటర్నేషనల్ కుట్రదారుడు అని కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ విజయశాంతి అన్నారు. పదేళ్లుగా కేసీఆర్ పాలనలో ప్రజలు అరిగోసలు పడ్డారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. శనివారం బాల్కొండ మండల కేంద్రంలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో పాల్గొని ప్రసంగించారు. అవినీతి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని ఇంటికి పంపి సునీల్‌కుమార్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కెసిఆర్ 10 ఏళ్లలో ఆరు లక్షల కోట్ల అప్పు లోకి తీసుకెళ్లాడని ప్రజల పట్ల ఏనాడూ ఆలోచించలేదని ఆమె మండిపడ్డారు. బీఆర్ఎస్ గెలిస్తే తెలంగాణ చస్తది కాంగ్రెస్‌కు ఓటేస్తే తెలంగాణ బతుకుతుందని ఆమె తెలిపారు. తప్పు చేసిన వాళ్లను గెలిపించకుండా చూడాలని ప్రజలను కోరారు. నాకు తెలంగాణ ప్రజల ముఖ్యం కాబట్టి బిజెపి పార్టీని రాములక్క అందుకే వీడిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలందరి ఇండ్లకు ఈడి సిబిఐ వాళ్లతో దాడి చేయిస్తుందని,కవిత లిక్కర్ స్కామ్ లో అడ్డంగా దొరికినా ఆమెపై ఎలాంటి చర్యలు ఇప్పటివరకు తీసుకోలేదని మండిపడ్డారు. అమిత్ షా టైం పాస్‌కు ప్రచా రం చేస్తున్నారని ప్రధాని సైతం అబద్ధాలు చెబు తున్నాడని ఆమె అన్నారు. ప్రజల క్షేమం కోరే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు.

నాయకులను కొంటే ఓట్లు రాలవ్

- నాయకులను కొనుక్కోవడం రేవంత్‌రెడ్డికి అలవాటే
- కేసీఆర్ పక్కా లోకల్..
- కామారెడ్డిలో అసైన్డ్ భూములకు పట్టాలిస్తాం
- నిజామాబాద్‌ను అభివృద్ధి చేసింది ఎవరు..?
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నిజామాబాద్‌లో మాట్లాడుతున్న కేటీఆర్

నవతెలంగాణ-భిక్కనూర్/కంఠేశ్వర్

నాయకులకు పైసలు ఆశ చూపి కొనుక్కోవడం రేవంత్‌రెడ్డికి అలవాటేనని, 50 లక్షల రూపాయలతో దొరికిన దొంగకు కామారెడ్డి ఓటర్లు ఓటు వేసే పరిస్థితి లేదని మంత్రి కేటీఆర్ అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో ప్రజలు తరిమికొడితే కామారెడ్డిలో పోటీ చేస్తున్నారని, అక్కడ చెల్లని రూపాయి కామారెడ్డిలో చెల్లుతుందా అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమానికి పురుడు పోసిన కామారెడ్డి జిల్లా ప్రజలు తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకువచ్చిన కెసిఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించి కామారెడ్డి జిల్లాను మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. శనివారం భిక్కనూరు మండల కేంద్రంతో పాటు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రోడ్ షో నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ గెలుపొంది అధికారంలోకి వచ్చిన తర్వాత కామారెడ్డిలో అసైన్డ్ భూములు లాక్కుంటారని ప్రతిపక్ష పార్టీల ఆరోపణలు అవాస్తవమని, అధికారంలోకి రాగానే అసైన్డ్ భూముల హక్కులు భూమి ఉన్నవారికి కల్పిస్తామన్నారు. కామారెడ్డి నుండి కెసిఆర్ గెలిచిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలోనే కామారెడ్డి నియోజకవర్గం నెంబర్ వన్ నియోజకవర్గంగా మార్చడం ఖాయమన్నారు. ఒక సంవత్సరం కాలంలోనే గోదావరి జలాలు భిక్కనూర్ పట్టణానికి తీసుకువచ్చి రైతులు కాళ్లు కడుగుతామని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 29 లక్షల మందికి 200 రూపాయలు పెన్షన్ ఇచ్చేదని దానికి 800 కోట్ల రూపాయలు ఖర్చయిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 46 లక్షల మందికి 2016 రూపాయలు పెన్షన్ ఇచ్చిన ఘనత కేసీఆర్కే దక్కుతుందన్నారు. భారతదేశంలోని 16 రాష్ట్రాలలో బీడి కార్మికులు ఉన్నారని ఏ ఒక్క రాష్ట్రంలో కూడా బీడీ కార్మికులకు పెన్షన్ ఇచ్చిన దాఖలాలు లేవని, కేవలం తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే బీడీ కార్మికులకు పెన్షన్ అందజేస్తుందన్నారు. రానున్న రోజుల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్షన్ను 3000 నుండి 5000 వరకు చేస్తుందన్నారు. బిజెపి అభ్యర్థి ఇస్తున్న సలాకా సిమెంటులకు ఓట్లు రావని, ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లు కెసిఆర్ నాన్ లోకల్ కాదని, తల్లిగారి ఊరైన కోనాపూర్ గ్రామమే కెసిఆర్ అని కెసిఆర్ లోకల్ లే కాని నాన్ లోకల్ కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్సీ షేర్ సుభాష్ రెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, పట్టణ సర్పంచ్ తునికి వేణు, నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో మండల ప్రజలు పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ నిజామాబాద్ లో ఐటి హబ్ ఎవరు కట్టారు? సమీకృత కలెక్టర్ కార్యాలయం ఎవరు కట్టారు? యువతకు స్కిల్స్ నేర్పించేందుకు న్యాక్ భవనం ఎవరు కట్టారు? గణేష్ బిగాల ముఖ్యమంత్రి కేసీఆర్ తో నిధులు మంజూరు చేసుకుని నిజామాబాద్ నగరాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. కరోన వచ్చినపుడు మీకు అండగా ఉండి మీకు అన్నం పెట్టింది గణేష్ బిగాల అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గణేష్ బిగాలకు నిజామాబాద్ లో ప్రతి గల్లీ, ప్రతి వీధి తెలుసు, గణేష్ బిగాల గెలిస్తే మీకు ఎపుడు అందుబాటులో ఉంటాడు. షబ్బీర్ అలీ గెలిస్తే మీకు పని పడితే ఎక్కడికి పోతారు అని ప్రశ్నించారు. ఒక్కసారి మీరు ఆలోచించండి అని తెలిపారు.

భిక్కనూర్‌లో..

